# మనసు పరిమళం

డ్రైవరు బస్సు ఎక్కి అతని సీటులో కూర్చుని ఇక బండి కదలబోతున్న దానికి సూచనగా "బయ్" మని హారన్ కొట్టాడు. బస్ చిన్నగా కదిలింది.

తన పక్కన ఖాళీ సీటులోకి ఎవరూ రానందుకు సంతోషిస్తూ నిశ్చింతగా నిట్టూర్చింది పరిమళ. ఆమె ఆనందం క్షణికమే అయింది. ఆఖరి నిమిషంలో హడావుడిగా వచ్చి ఒక పల్లెటూరి జంట బస్ ఎక్కింది. లోపలికి రాగానే పరిమళ పక్కన ఖాళీగా ఉన్న సీటుమీద పడిందా పెద్దాయన దృష్టి.

"నువ్వీడ కూచో.. నేనింకో సీటు చూసుకుంటా" నంటూ పెళ్ళానికి చెప్పి "ఈడ ఇంకెవరూ వచ్చేటోళ్ళు లేరు గదమ్మా" అని పరిమళ నడిగాడాయన. అతని దగ్గర నుండి వస్తున్న ఘాటైన చుట్టకంపుకు పరిమళకు కడుపులో తిప్పినట్టయింది. అతని వెనకాల నిలబడిన స్త్రీ నలిగిపోయిన ముతక చీరెలో, ముఖాన పావలా కాసంత బొట్టూ, చేతికి మట్టిగాజులతో వక్కాకు నములుతూ కనబడేసరికి పరిమళకు పరమ చిరాకుగా అనిపించింది.

"మా వాళ్ళున్నారు.... వెనకాల సీట్లున్నాయి చూడండి. అక్కడ కూర్చోండి" అంది ఆపద్ధర్మంగా అబద్ధమాడేస్తూ.

"అసలే ఒంటరిగా ప్రయాణం చేస్తున్న దిగులు. పైగా ఈ మురికి మనుషుల కంపు భరిస్తూ అన్ని గంటల సేపు ప్రయాణమంటే నరకమే" అనుకుంటూ తన హ్యాండ్‌బ్యాగు ఖాళీ స్థలంలో పెట్టింది ఎవరో ఉన్నారన్నట్టుగా.

ఆమె మాట నమ్మనట్టు సందేహంగా చూసాడు గానీ రెట్టించలేదాయన.

"అట్లే నిలబడి గుడ్లు మిటకరిస్తా చూస్తా నిలబడినావేంది? లోపలికిపా. కూచునేదానికి యాడన్నా చోటు చూసేదుందా లేదా?" అంటూ పెళ్ళాన్ని కసిరి బస్ లోపలివైపు వెనక సీట్ల వైపు చూస్తూ ముందుకు నడిచాడు.

చాకలి మూటలా కుక్కికుక్కి సామాన్లు పెట్టిన సంచీని చంకన పెట్టుకుని ముందుకు కదిలిందతని భార్య. "ఈ మురికి మనుషుల నుండి ఎలాగో తప్పించుకున్నాను" అనుకుంది పరిమళ. డ్రైవరు మరొకసారి హారన్ మోగించాడు. అది కండక్టరు లేని బస్సు. ఎక్కిన ప్రయాణకులకు డ్రైవరే టికెట్ కొట్టి ఇచ్చి లోపలికి పంపుతున్నాడు. డ్రైవరు తను కూర్చున్న స్థలం నుండి లేచి లోపలికి వచ్చి బస్‌లో ఉన్న ప్రయాణీకులను

లెక్కపెట్టుకుని, పరిమళ పక్కన ఖాళీగా ఉన్న సీటును ఒకసారి పరకాయించి చూసాడు "మీరొక్కరే కదా?" అనడిగిన డ్రైవర్‌కి 'ఆ' అంటూ అన్యమనస్కంగా జవాబిచ్చింది పరిమళ.

బస్ కొంత వెనక్కి కదలి పక్కకు తిరుగుతుండగా పరుగు పరుగున వచ్చి ఎక్కాడు ఒకతను. జీన్స్ ప్యాంటు, 'టీ'షర్టు, చేతిలో బ్రీఫ్‌కేసుతో 'ఈ ప్రపంచం నా స్వంతం' అన్నంత ధీమాగా, 'ఎవరినీ లెక్కజేయను' అన్నంత నిర్లక్ష్యంగా కనబడ్డాడు. అందంగా, ఆకర్షణీయంగా ఉన్నాడు. డ్రైవర్ బస్ ఆపి అతనికి టికెట్ ఇచ్చి మొదటి వరుసలోనే ఉన్న ఖాళీ సీటును అతనికి చూపాడు. అతను లోపలికి వస్తుండగానే "స్ప్రే" పరిమళం గాలిలో తేలి వచ్చింది.

అతను తన సీటు దగ్గరకు వచ్చి నిలబడి, చేతిలోని బ్రీఫ్‌కేసును పైన పెట్టి, ఖాళీ సీటులోని హ్యాండ్‌బ్యాగు వైపు ప్రశ్నార్థకంగా చూస్తుండగానే పరిమళ బ్యాగ్ తీసి ఒళ్ళో పెట్టుకుంది.

"చదువు, సంస్కారం ఉన్న మర్యాదస్తుడి లాగే ఉన్నాడు ఫరవాలేదు" అనుకుని కిటికీలోనుండి బయటకు చూస్తూ కూర్చుంది.

అనుకోకుండా ఈ ప్రయాణం చేయాల్సి వచ్చింది పరిమళ. అనంతపురంలో కొత్తగా ఈ మధ్యనే పెట్టిన ఒక జూనియర్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగానికి ధరఖాస్తు చేసింది. వాళ్ళు హఠాత్తుగా రేపు 'ఇంటర్వ్యూ' అంటూ రమ్మన్నారు. సరిగ్గా సమయానికి పాపకు జ్వరం. "జ్వరంతో ఉన్న రెండేళ్ళ పిల్లను వదిలేసి ఎలా వెళ్తాను. పోనీలే ఈ ఉద్యోగం నాకు ప్రాప్తం లేదు" అంటూ నిరాశపడింది పరిమళ.

కానీ ప్రకాష్ ఒప్పుకోలేదు. "పాప జ్వరం ఒక్కరోజులో తగ్గిపోతుంది. కానీ ఇటువంటి అవకాశం మళ్ళీ మళ్ళీ వస్తుందా? నేను ఆఫీస్‌కు సెలవు పెట్టి పాప దగ్గరే ఉంటాను. పనిమనిషి కూడా ఉంది కదా! మరేమీ ఫరవాలేదు. రేపు ఇంటర్వ్యూ అయిపోతే ఎల్లుండికల్లా వచ్చేస్తావు.." అంటూ ధైర్యం చెప్పి ఆమెను ఒప్పించాడు.

"పాప తరువాత ఇంకొక బాబు పుడితే చాలు అనుకుంటున్నారు వాళ్ళు. ఇద్దరి పిల్లలకి మంచి చదువు చెప్పించి, ఉజ్వలమైన భవిష్యత్తును చేకూర్చాలంటే ప్రకాష్ ఒక్కడి సంపాదన చాలదు. పెళ్ళవ్వగానే ప్రైవేటుగా ఎమ్.ఏకు కట్టింది. ఈ ఉద్యోగం తనకు వస్తే ప్రకాష్ కూడా అనంతపురానికి బదిలీ చేయించుకుంటాడు." పరిమళ తన ఆలోచనలలో మునిగి ఉండగా బస్ వేగం అందుకుని ఊరుదాటడం, బస్‌లో లైట్లు ఆరిపోవడం జరిగింది.

పక్కన కూర్చున్న అతను కాస్త కదిలి నట్టనిపించి కిటికీ వైపుకు ఒదిగి కూర్చుని, తలను వెనుక సీటుకు ఆన్చి కళ్ళు మూసుకుంది పరిమళ. డిగ్రీ పూర్తవ్వగానే పరిమళకు పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టారు తల్లిదండ్రులు. చూసిన మొదటి సంబంధమే కుదిరింది. ప్రకాష్ నెమ్మదస్తుడు. మంచి ఉద్యోగం ఉన్నది. వెడల్పు ముఖం, సన్నని మీసకట్టు,

చురుకైన కళ్ళు, చక్కని శరీరాకృతి గల ప్రకాష్ పరిమళ ఇంట్లో వాళ్ళందరికీ నచ్చాడు. అంతవరకు యూనివర్సిటీలో చేరుతాను. ఎమ్.ఏ. చదువుతాను అంటున్న పరిమళ కూడా ప్రకాష్‌ని చూసాక ఆ మాట ఎత్తడం మానేసింది. అయితే చదువుకోవాలన్న ఆమె కోరిక తెలిసి ప్రకాష్ ఆమెను ఎంతో ప్రోత్సహించాడు. డిగ్రీ వచ్చాక లెక్చరర్‌గా పని చేయాలన్న పరిమళ కోరికను అతను కాదనలేదు. ఫలితంగా ఈ ప్రయాణం పడింది. ఇదివరకెప్పుడూ ఒంటరిగా రాత్రివేళ బస్ ప్రయాణం చేయలేదు పరిమళ.

"నెల్లూరులో బస్ ఎక్కితే అనంతపురంలో దిగుతావు. బస్‌నిండా జనం ఉంటారు. అనంతపురంలో బస్టాండుకు మీ పిన్నికొడుకు వచ్చి ఇంటికి తీసుకువెళ్తాడు. నీ చేతిలో సెల్‌ఫోను ఉంది. ఇంక భయం దేనికి?" అంటూ ధైర్యం చెప్పి పంపాడు ప్రకాష్. ఆలోచనలు సాగుతుండగానే చల్లగాలికి పరిమళ కళ్ళమీదకి నిద్ర కమ్ముకొచ్చింది.

నడుము మీద వెచ్చని స్పర్శ సోకి నిద్ర నుండి ఉలిక్కిపడి లేచింది పరిమళ. పక్కన కూర్చున్న అతని చేయి ఆమె నడుము వెనుక భాగాన్ని తడుముతోంది. పరిమళ కదలగానే అతను ఏదో పొరపాటున తన చేయి ఆమెకు తగిలినట్టు చటుక్కున సర్దుకుని కూర్చున్నాడు. పరిమళ ముందుకు జరిగి నడుము సీటుకు తగలకుండా కూర్చుంది.

"పాప ఎలా వుందో! జ్వరం తగ్గిందో లేదో! పాలైనా తాగిందా? రాత్రి పాపం ప్రకాష్‌కు నిద్ర ఉండదు. రేపు మళ్ళీ ఆఫీస్‌కు వెళ్ళాలి. రేపొక్కరోజు ప్రొద్దున్న నుండి రాత్రిదాకా పనిమనిషి లక్ష్మిని పాపని చూసుకోమని బ్రతిమలాడి ఒప్పించింది. ఈ ఉద్యోగం వస్తే పాపను కాలేజీకి దగ్గర్లో ఉన్న క్రెష్‌లో చేర్పించాలి. ప్రకాష్‌కి ట్రాన్స్‌ఫర్ అయి అతను వచ్చేంత వరకు తను పిన్ని వాళ్ళింట్లో ఉంటే సరిపోతుంది" పరిమళ కళ్ళు నిద్ర బరువుతో మూతలు పడ్డాయి.

మళ్ళీ ఉలిక్కిపడి లేచింది. ఈ సారి పక్కన కూర్చున్న అతని చేయి ఆమె భుజం మీద నుండి క్రిందకి జారి చేతి వేళ్ళు ఆమె జాకెట్టుమెడ అంచులను తాకుతున్నాయి. పట్టరాని కోపంతో ఆ చేయి తీసి విదిలించి పక్కకు జరిగిందామె. అతను నిద్రలో ఉన్నట్టు ఈసారి తన తలను ఆమె భుజం మీదకి వాల్చాడు. "ఏయ్ మిస్టర్! కాస్త సరిగ్గా కూర్చుంటారా?" గట్టిగా అరచి గొడవ చేస్తే ఏం జరిగిందని అందరూ అడగడం, తన పరువు పోవడం తప్ప లాభం ఏమీ ఉండదనుకుంటూ మర్యాదగానే పదునైన స్వరంతో అడిగింది పరిమళ. అదీ అతనికి మాత్రం వినిపించే స్వరంలో.

అతను సర్దుకుని కూర్చున్నాడు. చీకట్లోనే అతని పెదవుల మీది వంకర నవ్వు గమనించింది పరిమళ. "ఇదెక్కడి గొడవ? ఏదో చదువు, సంస్కారం ఉన్న మనిషిలా ఉన్నాడనుకుంటే... చీకటిలో వయసు లోని ఆడది పక్కన ఉంటే ఏ మగాడైనా ఒకటే ఆలోచిస్తాడేమో! ఇంకో నాలుగు గంటల ప్రయాణం" అనుకుంటూ మరీ మూలకు

జరిగి కూర్చుంది. అతని దగ్గర నుండి వస్తున్న పరిమళం భరించలేనట్టు ముక్కుకు కర్చీపు అడ్డం పెట్టుకుంది.

ఈసారి అతను "వెధవ చేష్టలు చేస్తే ఏమైతే అయిందని దులిపి పారేయాలి" అనుకుంటూ కళ్ళు తెరచుకుని కిటికీలో నుండి బయటకు చూస్తూ కూర్చుంది. అరగంట తరువాత నిద్రనాపుకోలేక ఆమె కళ్ళు మూతలు పడ్డాయి. ఈసారి అతని చేయి ఆమె తొడమీద వేసాడు. ఆమె అదరిపాటుతో లేచి నిలబడింది. డ్రైవరు సినిమా పాటలు వినడంలో మునిగి పోయి ఉన్నాడు. బస్‌లో అందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఎవర్ని లేపాలి? ఆమె అటు ఇటు నిస్సహాయంగా చూస్తూ ఉండగానే తన పక్కన సీటు ఖాళీ లేదని అబద్ధం చెప్పి వెనక్కి పంపించిన పల్లెటూరి పెద్దాయన చటుక్కున లేచి ముందుకు వచ్చాడు.

"అమ్మాయా! నీకు ఇక్కడ బాగాలేకుంటే మా ఆడదాని పక్కన కూచోపో. నేనిక్కడ ఈ అబ్బయ్య పక్కన కూచుంటా" అన్నాడు ఆమె సీటు దగ్గర నిలబడి. పక్కనున్న అతను నిద్ర నటిస్తున్నాడు. పరిమళ క్షణకాలం కూడా ఆలోచించకుండా లేచి పక్కన కూర్చున్న జీన్స్ ప్యాంటు పెద్ద మనిషికి తగలకుండా ఇవతలికి వచ్చి ఆ ముతక దుస్తుల పల్లెటూరి రైతు పక్కన నిలబడింది. "చాలా థ్యాంక్సండీ! నేను వెనకాల మీ భార్య పక్కన కూర్చుంటాను" అంటూ వెనక్కి నడిచింది. ఇప్పుడాయన వద్ద నుండి వస్తున్న చుట్టకంపు వెగటుగా అనిపించలేదు పరిమళకు. ముతక చీరలో ఉన్న అతని భార్య నములుతున్న వక్కాకు వాసన కూడా చిరాకు కలిగించలేదు.

"ఈ దంపతుల మురికి బట్టల వెనక ఉన్న మంచి మనసును చూడలేక పోయింది తను. అలాగే సెంటు వాసనలు వెదజల్లుతున్న ఆ పెద్ద మనిషి మనసు లోని మురికిని, కంపును గమనించలేకపోయింది. పాఠాలు చెప్పబోతున్న తనకు ఈ రోజు మంచి పాఠం చెప్పింది ఈ అనుభవం" అనుకుంటూ వెనక్కివాలి కళ్ళు మూసుకుంది పరిమళ.

– చిత్ర సకుంటుబ సచిత్ర మాస పత్రిక డిసెంబర్ 2009